నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
19 వ వసంతంలోకి ...
రంగారెడ్డి
వికారాబాద్
మేడ్చల్
సోమవారం 3 నవంబర్ 2025 : పేజీలు 9





# రోడ్డెక్కిన గురుకుల విద్యార్థినులు...

● పెల్లుబికిన ఆగ్రహం ● ప్రిన్సిపల్ మా కొద్దంటూ నిరసన
● విద్యార్థి చెంపపై కొట్టిన కానిస్టేబుల్ ● మఫ్టీలో ఉన్న కానిస్టేబుల్‌ను చితకబాదిన విద్యార్థులు



షాద్‌నగర్ ముఖ్య కూడలిలో విద్యార్థినుల నిరసన


మఫ్టీలో ఉన్న కానిస్టేబుల్‌ను ఈడ్చుకుపోతున్న విద్యార్థినులు

**షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (నవంబర్ 01):**
ఆ గురుకులంలో విద్యార్థినుల ఆగ్రహం పెల్లుబికింది... వారు పడుతున్న భాదలు తట్టుకోలేక తాడోపేడో తేల్చుకోవాలనుకున్నారు. అనుకున్న ప్రకారమే విద్యార్థినులంతా కలిసి సెలవు రోజు చూసుకుని వందల మందితో ఒక్కసారిగా రోడ్డెక్కారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతూ నిరంతరం తమను వేదిస్తున్న ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున నిరసన చేశారు. ఈ క్రమంలో గురుకుల విద్యార్థినులు, పోలీసుల మధ్య వాగ్వివాదం రేగడంతో మఫ్టీలో ఉన్న మహిళా కానిస్టేబుల్‌ను చితకబాదిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో చోటుచేసుకుంది. మిగతా 2లో

# అనుమానమే పెనుభూతమై....

## అనుమానంతో భార్య, వదిన, కూతురిని చంపి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి


రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాలు

**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (నవంబర్ 03) :** భార్యపై అనుమానం పెంచుకున్న భర్త అమానుషంగా ప్రవర్తించాడు. కట్టుకున్న భార్య, వదిన, కూతురిని చంపడమే కాకుండా ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం కుల్కచర్ల మండల పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ రమేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్ల గ్రామానికి చెందిన వేపూరి యాదయ్య, అలవేలు భార్యాభర్తలు. వారికి అపర్ణ, శ్రావణి ఇద్దరు కుమార్తెలు. రోజువారీ కూలీగా పనిచేసే యాదయ్యకు భార్య అలవేలుపై మిగతా 3లో


ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన యాదయ్య

# రోడ్డు చిన్నది ప్రయాణం కష్టమన్నది

● ఓ పక్క గుంతల రోడ్లు- మరోపక్క రోడ్డెక్కిన ర్యాంపులు ● శ్రీరామ కాలనీ ప్రధాన రహదారిలో ప్రయాణికుల కష్టాలు ● రోడ్డు గుంతలగా, చెత్తతో ఉన్న అధికారులు పట్టించుకోరు ● కనీసం రోడ్డు కబ్జా అయిన మున్సిపల్, రెవెన్యూ అధికారుల మౌనం ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు



**జల్ పల్లి, మేజర్ న్యూస్ (నవంబర్ 02):** మిగతా 2లో

# రహమత్ నగర్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం

## : పాల్గొన్న మండల కాంగ్రెస్ నాయకులు



**శామీర్ పేట, మేజర్ న్యూస్ (నవంబర్, 02):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రహమత్ నగర్ డివిజన్‌లో మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కొరకు శామీర్ పేట, మిగతా 3లో



# కేశంపేటలో బోరుబావి తవ్వించిన దాతలు



కేశంపేట, మేజర్‌న్యూస్ (నవంబర్ 02): కేశంపేట మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద అయ్యప్పస్వాములు, భక్తుల సౌకర్యార్థం దాతలు ఆదివారం నూతనంగా బోరుబావిని తవ్వించారు. నీటి సౌకర్యం లేక కార్తీకమాసంలో అయ్యప్పలు, నిత్యం భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని గ్రామానికి చెందిన దాతలు బోరుబావిని తవ్వించారు. మరొక దాత మోటారును ఏర్పాటు చేశారు. దేవాలయం వద్ద దాతలు బోరుబావిని తవ్వించి, మోటారును ఏర్పాటు చేయడం పట్ల గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులు తిరుమలయ్యగౌడ్, రమణారెడ్డి, పాండుగౌడ్, అమరేష్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, హరికిషన్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన గురుకుల విద్యార్థినులు...



**మొదటిపేజీ తరువాయి...** ఇందుకు సంబందించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ సమీపంలోని ఓ పాత ఇంజనీరింగ్ కళాశాల భవనంలో నాగర్‌కర్నూల్‌కు చెందిన ప్రభుత్వ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాల కొంత కాలంగా కొనసాగుతుంది. గురుకుల కళాశాల ప్రిన్సిపల్ నిత్యం విద్యార్థినులను వేదించడంతో పాటుగా వారికి అందాల్సిన పోషాకాహారాలను పక్కదోవ పట్టిస్తుండటం చూసి ఒక్కసారిగా వారు ఆగ్రహానికి లోనయ్యారు. దీంతో ఆదివారం ఉదయం టిఫిన్ చేసిన తరువాత విద్యార్థినులంతా వరుస క్రమంలో గురుకుల కళాశాల నుండి నేరుగా షాద్‌నగర్ పట్టణం వైపు నడుచుకుంటూ వచ్చారు. వారిని అడ్డుకోవాలని చూసినా వినకుండా సుమారు మూడు కిలోమీటర్ల దూరం వందల మంది విద్యార్థినులు నడుచుకుంటూ వచ్చి షాద్‌నగర్ పట్టణ ముఖ్య కూడలిలో భైఠాయించారు. అక్రమాలు ఆపండి ఆతరువాత విద్యను అందించండి, ప్రిన్సిపల్ డౌన్ డౌన్, అవినీతి అధికారిని సస్పెండ్ చేయాలంటూ ఫ్లకార్డులు పట్టుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విద్యార్థినులంతా అనుకోకుండా ఒక్కసారిగా మెరుపు దర్నాకు దిగడంతో షాద్‌నగర్ పట్టణ రహదారులన్నీ ట్రాఫిక్ జామ్ అయ్యాయి. గురుకుల కళాశాల ప్రిన్సిపల్ విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తుందని, వివాహం అయిన విద్యార్థినులు పరీక్షలు రాయాలంటే కట్నం డబ్బులలో వాటా అడుగుతుందని విద్యార్థులు వాపోయారు. అంతేకాకుండా కళాశాలలో 500 మంది విద్యార్థినుల కోసం 20 కిలోల మటన్ తెస్తే అందులో నుండి 5 కిలోల మటన్ ఫ్రిడ్జ్‌లో దాచి ఉంచి, మరుసటి మెనూ రోజు అందిస్తుందని ఆరోపించారు. ఇలా కిచన్‌కు సంబందించిన అన్ని వస్తువులను బయటికి అమ్ముకుని సొమ్ము చేసుకుంటూ విద్యార్థినుల పట్ల వివక్ష చూపుతుందన్నారు. దీనికి తోడు విద్యార్థినుల నుండి బలవంతంగా పరీక్ష ఫీజులను అధికంగా వసూలు చేస్తుందన్నారు. విద్యార్థినుల మెరుపు దర్నాతో షాద్‌నగర్ పట్టణం అంతా ఆశ్చర్యపోయింది. వందల మంది గురుకుల విద్యార్థినులు రోడ్లపైకి రావడాన్ని చూసి వాహనదారులు అవాక్కయ్యారు. ఈ నేపథ్యంలో విద్యార్థినుల ఆందోళన విరమింపజేసే విదంగా పోలీసులు ప్రయత్నించారు. కాగా అదే సమయంలో ఓ విద్యార్థి సంఘం నాయకులు గురుకుల విద్యార్థినులకు మద్దతు తెలపడానికి రావడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో విద్యార్థినులకు పోలీసులకు మద్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే మఫ్టీలో ఉన్న మహిళా కానిస్టేబుల్ ఓ విద్యార్థినిని చెంపపై కొట్టడంతో పరిస్థితి ఒక్క సారిగా మారిపోయింది. ప్రిన్సిపల్ వేదింపులు బరించలేక న్యాయం చేయాలని రోడ్డుపైకి వస్తే విద్యార్థినిపై చేయి చేసుకుంటారా అంటూ మిగిలిన విద్యార్థినులంతా







సహనం కోల్పోయి మఫ్టీలో ఉన్న మహిళా కానిస్టేబుల్‌ని చితకబాదారు. విషయం తెలుసుకున్న సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలల జోనల్ అధికారిని నిర్మల సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపినా వారు శాంతించలేదు. పోలీసులు అతికష్టం మీద విద్యార్థినులకు నచ్చజెప్పి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి రహదారులపై ఎందుకు మీ కళాశాల వద్దే విచారణ చేపడదామని చెప్పడంతో వారు గురుకుల కళాశాల బాట పడ్డారు. తీరా అక్కడకు చేరుకున్న విద్యార్థినులు ఆరు బయటే కూర్చుని అధికారుల కోసం వేచి ఉన్నారు. అక్కడకు చేరుకున్న సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల జోనల్ అధికారిని నిర్మల, స్థానిక ఏసిపి లక్ష్మినారాయణ, పట్టణ సిఐ విజయ్‌కుమార్ కళాశాలలో జరుగుతున్న సంఘటనలపై ఆరాతీశారు. త్వరలోనే ఈ విషయమై విచారణ కమిటీని వేసి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.

## ఆపదలో ఉన్న బాల్యస్నేహితురాలికి అండగా నిలిచిన మిత్రబృందం



మాడ్గుల, మేజర్‌న్యూస్ (నవంబర్ 02): మాడ్గుల మండలం ఆర్కపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల 2000-01 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన సువర్ణ భర్త బుర్రి గిరి (45) గతకొన్ని రోజులుగా అనారోగ్యంతో బాదపడుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. ఈమేరకు విషయం తెలుసుకున్న సువర్ణ పదవతరగతి సహ విద్యార్థులు ఆపదలో ఉన్న తమ మిత్రురాలికి అండగా నిలిచేందుకు ముందుకు వచ్చి ఆదివారం బుర్రి గిరి అంత్యక్రియల అనంతరం ఆమె కుటుంబీకులను ఓదార్చి స్వచ్ఛందంగా సమకూర్చిన 21వేల రూపాయల నగదును బాల్యమిత్రురాలికి అందజేసి స్నేహం విలువ చాటారు. ఈసందర్భంగా మిత్రబృందం సభ్యులు మాట్లాడుతూ తమ బాల్యమిత్రురాలి భర్త అకాలమృతి తీవ్రంగా కలిచివేసిందని, ఆపదలో ఉన్న ఆమె కుటుంబానికి తామంతా ఎల్లవేళలా అండగా వుంటామని భరోసానిచ్చారు. సువర్ణను ఓదార్చి ఆర్థిక సహాయం అందజేసినవారిలో ఆమె సహ విద్యార్థులు కల్లు తిరుపతిరెడ్డి, మురుపోజు లక్ష్మణ్‌చారి, సిరుసవాడ రమేష్‌ప్రజాపతి, దండు సురేష్‌గౌడ్, దండు సంతోష్‌గౌడ్, సీత నరేష్,కె. ఆంజనేయులు, శ్రీదేవి, విజయ, సరిత తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (నవంబర్ 02): విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని విద్యుత్‌శాఖ ఏడీఇ కార్యాలయంలో సోమవారం వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు ఏడీఇ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ టౌన్, రూరల్ అందుబాటులో ఉంటారని, వినియోగదారులు తమ సమస్యలపై ఫిర్యాదులను అందజేయాలని ఆయన కోరారు.

# రోడ్డు చిన్నది ప్రయాణం కష్టమన్నది



**జల్ పల్లి, మేజర్ న్యూస్ (నవంబర్ 02):** ప్రభుత్వ నిబంధనలు కేవలం పేదవారికే వర్తిస్తాయి, ఎందుకంటే అధికారులు పేదల పట్ల ఒక న్యాయంగా, పలుకుబడి ఉన్నవారికి మరొక న్యాయంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జల్ పల్లి పురపాలక పరిధి, శ్రీ రామ కాలనీ ప్రధాన రహదారి రోడ్డు ఉన్నదే చిన్నది...ఆ రోడ్డులో ప్రయాణం చేయాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. అంతేకాకుండా ఆ రోడ్డు మార్గాన గుంతలు, చెత్త ఉండడంతో ప్రయాణం చేయాలా వద్దా అన్నట్టుగా తమ బాధను భరిస్తూ ప్రయాణం చేస్తున్నారు. శ్రీరామ కాలనీ నుండి మధబన్ కాలనీ వెళ్లాలన్న, మధుబన్ కాలనీ నుండి శ్రీరామ కాలనీకి రావాలన్న ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. వాహనదారులు ఎలాగో అలాగా ప్రయాణం చేస్తున్నారు... కానీ పాధాచారులు మాత్రం మధుబన్ కాలనీకి వెళ్లలేనీ పరిస్థితి అక్కడ నెలకొంది. ఓ పక్క దుర్వాసన...? మరోపక్క కల్వర్టు నాలాపై నిర్మాణం చేపట్టి, సగం రోడ్లు కబ్జా చేశారు...? ఇంకేముంది అక్కడ, ఒక బస్సు మరో వాహనం వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడుతూ నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ... తమ బాధ ఎవరితో చెప్పుకోలేని పరిస్థితి అక్కడ నెలకొంటుంది. నగరానికి కూత వేటు దూరంలో ఉన్న శివారు ప్రాంతం, జల్ పల్లి పురపాలక పరిధి శ్రీరామ కాలనీ అంటే ఒక మినీ ఇండియా... ఇక్కడ ఎంతోమంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి జీవనం కొనసాగిస్తుంటారు. అలాగే ప్రయాణాలు కూడా జరుగుతుంటాయి. అలాంటి శ్రీరామ కాలనీ ప్రధాన రహదారి ఇంత దారుణంగా ఉందంటే జల్ పల్లి మున్సిపల్ అధికారులు, అటు రాజేంద్రనగర్ జిహెచ్‌ఎంసి అధికారులు, బాలాపూర్ రెవెన్యూ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో మనం అర్థం చేసుకోవచ్చు. ఇటీవలే బాలాపూర్ రెవెన్యూ అధికారులు జల్ పల్లి మున్సిపల్ పరిధి సబితా ఇంద్రారెడ్డి కాలనీలో ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం చేపట్టారని, నిర్మాణం చేపట్టిన మొదటి రోజే జెసిబిలతో కూల్చేశారు. ఓ పేద కుటుంబం 60 గజాలలో అక్రమ నిర్మాణం చేపట్టిన వెంటనే కూల్చేస్తున్న రెవెన్యూ అధికారులకు అదే బాలాపూర్ మండలానికి చెందిన శ్రీరామ కాలనీ ప్రధాన రహదారి రోడ్డు, కల్వర్టు నాల ఆక్రమానికి గురవుతే ఎందుకు చర్యలు చేపట్టడం లేదో అని స్థానిక ప్రజలు, ప్రయాణికులు బాలాపూర్ మండల రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని,



పేదల కోసం న్యాయం జరుగుతుందని, అలాంటి కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో సీఎం రేవంత్ రెడ్డి తెచ్చిన హైడ్రా పేద ప్రజలకు రక్షణ కల్పిస్తుందని నమ్మకం లేకపోయిందంటున్నారు.పేదలు నివసిస్తున్న శ్రీరామ కాలనీ ప్రాంతంలో రోడ్లు కబ్జాలకు గురవుతున్న, కల్వర్టు నాళాలపై సైతం నిర్మాణాలు చేపడుతున్న అధికారుల మౌనం, పేద ప్రజలు నోరు విప్పరులే అన్నట్టుగానే ఇక్కడి పాలన నడుస్తుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. స్థానికంగా నాయకుల పదవీకాలం ముగిసి సంవత్సర కాలం గడుస్తుంది. ఇంకేముంది మనను ఎవరు ప్రశ్నించరులే అన్నట్టుగా, ఇక తమను అడిగే వారు లేనట్టుగానే కొంతమంది తమ అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలపై కాలనీ ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసిన తమ వెనుక కొంతమంది నాయకులు ఉన్నారని, బెదిరింపులకు సైతం పాలు పడుతున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. కానీ జల్ పల్లి పురపాలక పరిధిలో పేదలకు ఒక న్యాయం, ఉన్నవాళ్లకు ఒక న్యాయంగా ఇక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయంటే ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాల్సిందేనని, ఇక ఇలాంటి అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడవలసిందేనని శ్రీరామ కాలనీ ప్రజలు అంటున్నారు.

## ప్రభుత్వ భూమిని అక్రమ పద్ధతితో ఇతరులకు సహకరించిన

# అధికారులపై చర్యలు తీసుకోవాలి

- అవినీతి సొమ్ముకు ఆశ పడిన అప్పటి ఆర్‌డిఓ, సబ్ రిజిస్ట్రార్‌పై దర్యాప్తు చేపట్టాలి
- ప్రజా సంఘాల నేతలు డిమాండ్



**తాండూరు, మేజర్ న్యూస్ (నవంబర్ 02):** తాండూరు పట్టణంలోని నడి బొడ్డున వినాయక చౌక్ ప్రాంతంలోగల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా దారుల నుండి కాపాడాలి అని ప్రజా సంఘాలకు చెందిన పలువురు నేతలు డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆదివారం నాడు తాండూరు టౌన్ వారు ఒక సమావేశమై వివరాలను పత్రికాలకు విడుదల చేశారు. తాండూరులోని నడి బొడ్డున గల 484చదరపు గజాల స్థలం కందిషీకుల స్థలం అని వారు పేర్కొన్నారు 1947లో భారత్ కు స్వాతంత్రం వచ్చిన తర్వాత దేశ విభజన జరిగింది అని అప్పట్లో కొందరు ముస్లిం లు దేశం వదిలి పాకిస్థాన్ వెళ్లిపోయారు అని, దాంతో ఆ స్థలం ప్రభుత్వం అధీనంలో ఉంటుంది అని వారు పేర్కొన్నారు.అలాంటి భూమిని గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో తాండూరు ఆర్‌డిఓగా ఉన్న అశోక్ కుమార్ మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ ఉన్నప్పుడే హౌస్ నెంబర్ ఇచ్చి అసెస్మెంట్ చేశారు అని, దాని ఆధారంగా అప్పటి తాండూరు సబ్ రిజిస్ట్రార్ జాలిమోద్దీన్ దామోదర్ రెడ్డి అనే ఒక్క వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశారు అని పేర్కొన్నారు.కొన్ని నెలల క్రితం తాండూరు కు చెందిన ఒక్క వ్యాపారి ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొని. అక్కడ నివాసం ఉన్న వారిని పంపి ఆ భూమిని సాదును చేశారు అని అన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన అప్పటి అధికారుల అందరిపై సమగ్ర విచారణ జరుపాలి అని అన్నారు.ఈ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నేతలు కే. శ్రీనివాస్, ఉప్పలి మల్కాయ్య, సాదిక్, చంద్రయ్య,నర్సిములు, కృష్ణ, ఎల్లప్ప, తదితరులు ఉన్నారు.

# సీసీఐ ద్వార పత్తి కొనుగోలు ఎప్పుడో?

- ప్రారంభం కాక దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- తుకాల పేరుతో మోసం చేస్తున్న దళారులు



గత ఏడాది సీసీఐ ద్వార పత్తి విక్రయాలు చేస్తున్న రైతులు (ఫైల్ ఫోటో)

పెద్దేముల్,మేజర్ న్యూస్ (నవంబర్ 02)ః

పెద్దేముల్ మండలంలో ప్రభుత్వం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంను ప్రారంభం చేయకపోవడంతో పత్తి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పంట పోలాల నుండి పత్తి తీసిన చిన్న సన్న కారు రైతులు కులీలకు పెట్టుబడులు లేక దళారులను అశ్రయించడం జరుగుతుందని అంటున్నారు. దళారులు రైతులకు నయానో... భయానో ఇస్తూ తుకాల పేరుతో నట్టెట ముంచుతున్నారు. ప్రభుత్వం సీసీఐ ద్వార క్వింటాళ్లుకు రూ.8,110 ధర ఉంటే దళారులు తేమ పేరుతో 6,500 నుండి రూ.7,000వేలు తీసుకుంటున్నారని, అంతేగాకుండా తుకాల పేరుతో క్వింటాళ్లుకు 10కిలోల వరకు దోచుకుంటున్నారని రైతులు అంటున్నారు. ఎక్కడ దిక్కులేక వారిని ఆశ్రయించ వలసి వస్తుందని చెబుతున్నారు. ప్రతి ఏటా రైతులను తుకాల పేరుతో మోసాలు చేస్తున్న కనీసం రెవెన్యూ, వ్యవసాయ, తుకికల అధికారులు పట్టించుకోక పోవడం సిగ్గు చేటని రైతన్నలు మండి పడుతున్నారు. గత ప్రభుత్వంలో రైతులకు తుకాల పేరుతో మోసాలు జరిగితే వెంటనే సంబందిత అధికారులు దాడులు చేసి అట్టి వారిపై చర్యలు తీసుకునేదని, ఈ ప్రభుత్వంలో రైతులకు అన్యాయాలు జరుగుతున్న పట్టించుకునే వారు కరువయ్యారని అంటున్నారు. పెద్దేముల్ మండలంలోని నాగులపల్లి, రుద్రారం, పెద్దేముల్, గాజీపూర్, బుద్దారం, నర్సపూర్‌తో పాటు పలు గ్రామాలల్లో రైతులు పత్తి తీయడం ప్రారంభం చేశారు. పత్తి తీత ప్రారంభం దశలో తునికల అధికారులు ఎవరు పట్టించుకోరంటు దళారులు తుకాల పేరుతో మోసం చేస్తున్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలో దళారులు రైతులను పట్ట పగలు దోచుకుంటున్నారని పలు గ్రామాల ప్రజల ద్వార తెలస్తుంది. మండలంలోని ఇందూరు, మంబాపూర్, పెద్దేముల్, నాగులపల్లి, ఆత్కూర్, రుక్మాపూర్‌తో పాటు పలు గ్రామాలల్లో పత్తి దళారులు అధికంగా ఉన్నట్లు సమాచారం. పంట చేతికి రాకముందే రైతన్నలను గ్రామాలల్లో ఉన్న దళారులు గాళం వేస్తున్నారు. దీంతో ప్రతి ఏటా నష్టాలు తప్పడం లేదని, ప్రభుత్వం ఇప్పటికైన వెంటనే స్పందించి మండలంలో సీసీఐ కోనుగోలు కేంద్రంను ప్రారంభం చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

## పాఠశాల అభివృద్ధికి కృషిచేసిన కొత్త నరసింహులు కొత్త రామలింగయ్య కుటుంబ సభ్యులు

### ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన జడ్పీహెచ్ఎస్ పాఠశాల చైర్మన్ పెరుమాండ్ల లలితమ్మ



తలకొండపల్లి, మేజర్‌న్యూస్ (నవంబర్ 02) : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ దాతలు దివంగత కొత్త నరసింహులు ఈశ్వరమ్మ, కొత్త రామలింగయ్య కమలమ్మ జ్ఞాపకార్థం దాదాపు 15 లక్షల వ్యయంతో తమ కుటుంబ సభ్యులు ఎన్నారై వాణి రామకృష్ణ , శివ కుమార్, రాఘవేందర్‌లు విద్యార్థులకు సౌకర్యవంతమైన అదనపు గదుల నూతన భవనాన్ని నిర్మించి ఆదివారం ప్రారంభించారు. అనంతరం స్కూల్ చైర్మన్ పెరుమాండ్ల లలితమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ గతంలో ఇదే పాఠశాలలో చదివి అమెరికాలో స్థిరపడే స్థాయికి వచ్చామంటూ గుర్తుచేస్తూ, తాము చదువుకున్న పాఠశాలకి ఏదో ఒకటి తమ వంతుగా సహాయం చేయాలనే తపనతో పే బ్యాక్ సొసైటీ ద్వార దృడ సంకల్పంతో స్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి కృషి చేశామని తెలియజేశారు. గతంలో మేము చదువుకునే సమయంలో ఇలాంటి వసతులు ఉండేవి కావు, కానీ ఇప్పుడు మీకు అన్ని రకాల వసతులను కల్పిస్తున్నారు. కావున విద్యార్థిని విద్యార్థులు



చదువుకునే సమయాన్ని సద్వినియోగం చేసుకొని గొప్ప స్థాయికి ఎదగాలని కోరారు. అదేవిధంగా స్కూల్ చైర్మన్ పెరుమాండ్ల లలితమ్మ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన కొత్త నరసింహులు కొత్త రామలింగయ్య కుటుంబం చిన్నప్పటినుండి ఎన్నో దాన ధర్మాలు చేస్తూ తలకొండపల్లి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వారి గొప్పతనాన్ని కొనియాడారు. వారి కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకొని, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మన మండల పాఠశాల అభివృద్ధికి కృషి చేసే విధంగా దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య, సింగిల్ విండో చైర్మెన్ కటికల శేఖర్‌యాదవ్, మెహన్‌రెడ్డి, ఎచ్‌ఎం ఝాన్సీలక్ష్మీ, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థిని విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### రహమత్ నగర్‌లో జూబ్లీహిల్స్

# ఉప ఎన్నికల ప్రచారం

మొదటిపేజీ తరువాయి... మూడు చింతలపల్లి మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్,మేడ్చల్ జిల్లా ఆర్టిఏ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, హజ్ కమిటీ మెంబర్ ముజీబుద్దీన్ అలియాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్,మూడు చింతల పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్,కాంగ్రెస్ నాయకులు గుర్రం బస్వా రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,మర్యాల వీరేషం గుప్తా, వెంకట గిరి ప్రసాద్, భూమి రెడ్డి, నవీన్ రెడ్డి ఊరడి వెంకటేష్ తుంకి లక్ష్మయ్య, కొమ్ము వినోద్, మునికొండ నవీన్ పిట్ల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానమే పెనుభూతమై....

### అనుమానంతో భార్య, వదిన, కూతురిని చంపి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి



సంఘటన స్థలంలో పరిసరాలను పరిశీలిస్తున్న పోలీసులు

మొదటిపేజీ తరువాయి... అక్రమ సంబంధం పెట్టుకుందని ఆమెపై అనుమానంతో ప్రతీరోజు గొడవ పడేవాడు కాగా భార్యాభర్తల మధ్య ఘర్షణలు తీవ్రమయ్యాయి. దీంతో అలవేలు అక్కయినా హన్మమ్మకు ఫోన్ చేసి కుల్కచర్లలో ఒక గ్రామ పెద్ద ఆధ్వర్యంలో పంచాయతీ పెట్టి యాదయ్యను సముదాయించారు. దీంతో పంచాయతీ పెట్టి అవమానిస్తారా అని కక్ష పెంచుకున్న యాదయ్య అర్ధరాత్రి సమయంలో దారుణానికి ఒడిగట్టాడు. భార్య అలవేలు (32), కూతురు శ్రావణి (13), వదిన హన్మమ్మ (40)ను కోడవలితో గొంతుకోసి హత్య చేశాడు. పెద్దకుమార్తె అపర్ణపై కూడా దాడి చేయబోగా ఆమె తప్పించుకొని పారిపోయింది. ఈ విషయాన్ని చుట్టుపక్కల వారికి చెప్పడంతో.. వారు వచ్చేలోపే యాదయ్య ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాల సోదరుడు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. అంతకుముందు ఘటనాస్థలికి చేరుకున్నారు. పరిగి డీఎస్పీ శ్రీనివాస్ హత్య జరిగిన ప్రాంతానికి వెళ్లి వివరాలు సేకరించారు.

# విద్యుత్ షాక్ తో రైతు మృతి...



మృతుడు భూపాల్ రెడ్డి

**చేవెళ్ల, మేజర్ న్యూస్ (నవంబర్ 02):** వరి పొలంకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు పందులకు నివారణకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్ తాకి మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని సింగప్పగూడ గ్రామానికి చెందిన పడమటి భూపాల్ రెడ్డి(55)తనకు ఉన్న పొలంలో వరి పంట సాగు చేశాడు. ఆ పొలం పక్కనే సోదరుడి వరి పొలంకు అడవి పందుల నివారణ కోసం విద్యుత్ వైరును ఏర్పాటు చేశాడు.అడవి పందుల నివారణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు విషయాన్ని పడమటి రవీందర్ రెడ్డి ఎవరికి తెలపలేదు. దీంతో భూపాల్ రెడ్డి నిత్యం ఉదయం వరి సాగుకు నీరు పెట్టేందుకు వెళ్లేవాడు. ఎప్పటి మాదిరిగానే ఆదివారం పొలానికి వెళ్లాడు. గట్టు పై నడుస్తుండగా పందుల నివారణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్ కు భూపాల్ రెడ్డి చేతికి తగిలి అక్కడే పడిపోయాడు. తండ్రి రాలేదని కొడుకు నరేందర్ రెడ్డి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు.

అనుమానం వచ్చి వెళ్లి చూడగా షాక్ తగిలి పొలం గట్టు పై పడి ఉన్నాడు. వెంటనే చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఇంటి నిర్మాణానికి ఉప్పల వెంకటేష్ సహకారం

తలకొండపల్లి, మేజర్‌న్యూస్ (నవంబర్ 02): ఉప్పల చారిటబుల్ ట్రస్టు సహకారంతో మిషన్ భగీరత మాజీ వైస్ చైర్మెన్, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మెన్ ఉప్పల వెంకటేష్ నిరుపేద ఇళ్ళ నిర్మాణానికి తన ట్రస్టు సహకారంతో చేయూత అందిస్తున్నారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన మరల ఎల్లయ్య ఇంటి నిర్మాణంలో బాగంగా ఫినిషింగ్ కొరకు సిమెంట్ బస్తాలు అందజేయడం జరిగింది. తన ఇంటి నిర్మాణాని సిమెంట్ అందజేసి సహకరించిన ఉప్పల వెంకటేష్‌కు ఎల్లయ్య కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, సింగిల్ విండో డైరెక్టర్స్ కటికల శేఖర్‌యాదవ్, యాదయ్య, వార్డు సభ్యులు నూకం ఈశ్వర్‌ముదిరాజ్, దశరథం తదితరులు పాల్గొన్నారు.




# పదవీ విరమణ పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రజాసేవకు పునరంకితం కావాలి

▶▶ గిరికొత్తపల్లికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత ఉద్యోగ విరమణ, వీడ్కోలు కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

▶▶ వివరాలు వెల్లడించిన ఎస్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు




మాడ్గుల, మేజర్‌న్యూస్ (నవంబర్ 02): పదవీ విరమణ పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రజాసేవకు పునరంకితం కావాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు. అంకితభావం, సమాజిక స్పృహతో దశాబ్దాల కాలం పాటు విశిష్ట సేవలందించి ఉపాధ్యాయ వృతికి వన్నె తెచ్చి ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారం దక్కించుకున్న ఇట్టె కృష్ణారెడ్డి నాబోవు రోజుల్లో సమాజ చైతన్యానికి తన సేవలను కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. మాడ్గుల మండలం గిరికొత్తపల్లి గ్రామానికి చెంది కొత్తపేట్ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు, నమస్తే ఉపాధ్యాయ పత్రిక సహ సంపాదకులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత ఇట్టె కృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ, వీడ్కోలు కార్యక్రమాన్ని ఆదివారం హైద్రాబాద్‌లో ఘనంగా నిర్వహించడం జరిగిందని ఎస్‌టియూటిఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్టీయు టిఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్, మాజీ ఎమ్మెల్యే కత్తి నర్సింహ్మారెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు భీమనాథుని రవి, ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్, మాజీ అధ్యక్షులు పర్వత్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై కృష్ణారెడ్డి, రజిత దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేయడం జరిగిందని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో గురువుల పాత్ర వెలకట్టలేనిదని, ఉపాధ్యాయులకు విద్యార్థులకు మధ్య అనుబంధం పెరిగినప్పుడే ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యపడతుందన్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల సంఖ్య పడిపోతూ ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రమాదకరంగా మారుతుందని, విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు ప్రజలందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల్లో 36 లక్షల మంది విద్యార్థులు ఉండగా, ప్రభుత్వ పాఠశాలలో 18 లక్షలకు విద్యార్థుల సంఖ్య పడిపోవడం విచారకరమని ఆయన పేర్కొన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లిక్కీ అనురుద్రారెడ్డి, ఎంఈఓ రామారావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నర్సింహ్మా, శంకర్, శృతిలయ కల్చర్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్ దాస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సుధాకర్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, రాధా, జయలక్ష్మి, శిరీష, విశ్వశాంతి, నీరజ, పాండురంగారెడ్డి, రాంరెడ్డి, నాయకులు గొంది జైపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , రాజేందర్ రెడ్డి, పోల్‌రెడ్డి, ఫణికుమార్‌రెడ్డి,మానస, సాయికిరణ్‌రెడ్డి, శిరీష, కవిత, సునిత , రాములమ్మ, యాదవరెడ్డి, వనజాత, ప్రమోదిత, సబితా, వికాస్, రాజవర్ధన్ రెడ్డి, సాయికిషోర్, అభినవ్ రెడ్డి తదితరులు పాల్గొనట్లు ఎస్‌టియూ టిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు తెలిపారు.

# మానవత్వమే – మతము : డాక్టర్ ఉమర్ ఆలీషా



మహశ్వరం,మేజర్ న్యూస్ (నవంబరు 2): మానవత్యమే మతము మానవత్వమే ఈశ్వ రత్వమని నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. ఆదివారం మండలంలోని ఘట్టుపల్లి గ్రామంలో శ్రీ విశ్వ విజ్ఞాన వి ద్యా ఆధ్యాత్మిక పీఠములో కార్తీక మాసం సభ కార్యక్రమంలో పాల్గొన్ని ఆయన మాట్లాడుతూ.. మానవులు జడ కాలుష్యాన్ని నివారించుకొనుటకు జ్ఞాన సాధనలు బాగమైన జ్ఞానాన్ని అభ్యసించి ఆచరించాలని అన్నారు. పాలు రూపంగా ఉన్న మానవుడు నెయ్యి స్వరూపంగా మారాలని, ఏ విధంగా అయితే పాలు, పెరుగుగా, పెరుగుచివెనే్గ్రో, వెన్న నెయ్యిగా నెయ్యి –దీప స్వరూపంగా పరిణామం చెందుతుందో అదే విధంగా మానవుడు మంత్రసాధన, జ్ఞాన సాధన ద్యస సాధన ఆచరించుట ద్వారా త్రయీ సాధన చేయుటద్వారా మంత్రసాధన ద్వారా నారీరక తత్వము జ్ఞాన సాధన ద్వారా మానసిక తత్వము ధ్యాన సాధన ద్వారా ఆత్మ తత్వము తదుపరి పరమాత్మ తత్వము పొందుతారని తెలిపారు. మానవునిలో పరమాత్మ తత్వము ఆత్మ స్వరూపంగా సూక్ష్మంగా నిండి ఉన్నది. నెయ్యిని నేతి ద్వారా దీపారధన చేసినప్పుడు తేజస్వరూపమైన జ్యోతి ఏవిధంగా ఉన్నదో, అదే విధంగా మనలో ఉన్న కల్మషాలని మంత్ర సాధన ద్వారా నివారించుకుని జ్ఞానసాధన ద్వారా తత్వాన్ని ఆచరించి అనుసరించి, ధ్వాన సాధన ద్వారా అత్మ తత్మ ఎరిగి పరమాత్మ తత్వంగా దీపం యొక్క జ్యోతి వలె పరిణామం కలిగే స్థితి త్రయీ సాధన ద్వారా మానవులకు లభించబడింది .ఈ కార్యక్రమంలో నాగ మూర్తి శర్మ,డాక్టర్ దాసరి శ్రీనివాసులు ,సిహెచ్ విజయ్ కుమార్,కె వి ఎన్ ఆచారి, సి చక్రవర్తి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

**బిజెపి మండల అద్యక్షుడు నూకం రాజు ముదిరాజ్**



మంచాల, మేజర్ న్యూస్ (నవంబర్ 02) : బుగ్గజాతర ఉత్సవాల సందర్భంగా ముద్రించిన వాల్‌పోస్టర్‌పై ఎంఎల్‌సీ ఏవీఎన్ రెడ్డి ఫొటో వేయకుండా అగౌరవ పరిచి, ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని బిజెపి మండల అద్యక్షుడు నూకం రాజు ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఈ నెల 5 నుండి ప్రారంభమయ్యే బుగ్గజాతర ఉత్సవాల వాల్‌పోస్టర్‌పై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఫొటోలు ముద్రించి, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పట్టుభద్రుల ఎంఎల్‌సీ ఏవీఎన్ రెడ్డి ఫొటో వేయకుండా అగౌరవ పరిచిన దేవాదాయ శాఖ అధికారులు, మండల అధికారులపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. దైవ కార్యక్రమాలల్లో రాజకీయ జోక్యం తగదని హెచ్చరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రోటోకాల్ పాటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మారగోని శ్రీశైలం, పాండాల జంగయ్య గౌడ్, చివిరాల పాండు, మండల ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు రాజేందర్ రెడ్డి, ప్రకాష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు



గండిపేట్, మేజర్ న్యూస్ (నవంబర్ 02) కాంగ్రెస్ పార్టీ పాలనలో విసిగిపోయిన ప్రజలు మళ్లీ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి వ్యాఖ్యానించారు.ఆదివారం బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బైరాగి గూడా డబుల్ బెడ్ రూమ్ వాసులు బి జె ఎం సి.. బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి రాజేంద్రనగర్ రాజేంద్రనగర్ ఇంచార్జ్ పటోళ్ల కార్తిక్ రెడ్డి చేతుల మీదుగా పార్టీ కండువా కప్పుకొని బిఆర్ఎస్ పార్టీ లో చేరారు. ఈ మేరకు మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ..... కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలు విసిగిపోయారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బడుగు బలహీన ప్రజల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలకె అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసిన అరాచకాలు పెరిగిపోయాయని వీటన్నిటిని చూసి రాష్ట్ర ప్రజలు మళ్లీ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. దీనికి నిదర్శనం వందలాదిమంది ప్రజలు స్వచ్ఛందంగా బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకోవడం మే సాక్ష్యం అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాముడు యాదవ్, వెంకటేష్, గంగాని రవి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్తీకమాసం పూజలు



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (నవంబర్ 2): కార్తీకమాసం సందర్భంగా చేవెళ్ల శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. కార్తీకమాసంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు చేయడంతో అంత శుభమే జరుగుతుందని భక్తుల నమ్మకం.కార్తీకమాసం సందర్భంగా ఆలయాలన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలతో వెదజల్లుతున్నాయి.

# కేశంపేటలో చాతుర్మాస్య యజ్ఞం పరిసమాప్తి



కేశంపేట, మేజర్‌న్యూస్ (నవంబర్ 02): కేశంపేట మండల కేంద్రంలోని శ్రీహనుమాన్ దేవాలయంలో గత నాలుగు నెలలుగా నిర్వహించిన చాతుర్మాస్య యజ్ఞాన్ని ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పరిసమాప్తి చేశారు. యజ్ఞం చివరి రోజు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు గత మూడు రోజలుగా గ్రామానికి చెందిన డాక్టర్ రవిందర్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటి చైర్మెన్ మఠం చంద్రశేఖర్, మాజీ ఎంపిపి సజ్జల విశ్వనాథం, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, యజ్ఞ నిర్వాహకులు విజయరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఇరువెంటి చంద్రయ్య, బాల్‌రెడ్డి, జూలపల్లి అనసూయ, ఆర్.మల్లారెడ్డి, స్వామి, టి.రంగారెడ్డిలతో భక్తులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో కేశంపేట బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



కేశంపేట, మేజర్‌న్యూస్ (నవంబర్ 02): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక సంధ్బంగా నియోజకవర్గ పరిధిలోని సంజీవగాంధీ నగర్‌లో కేశంపేట మండల బీఆర్ఎస్ నాయకులు ఆదివారం పార్టీ అభ్యర్థి మాగంటి సునీత మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నాయకులు ఇంటింటికి తిరుగుతూ మాగంటి సునీతను భారీ మెజార్టితో గెలిపించాలని కోరారు. ప్రచారానికి ప్రజల నుంచి మంచి మద్దతు లభించిందని నాయకులు తెలిపారు. ఈ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ తాంద్ర విష్ణువర్ధన్‌రెడ్డి, మామిడి యాదయ్యగౌడ్, లెంకపోతుల కుమార్‌గౌడ్, పోచారం జగన్‌రెడ్డి, రజనీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి కష్టాలు తీర్చే నాధుడే లేడా...?

● మిషన్ భగీరథ నీరు అయితే కొన్ని కాలనీలకు రానే రాదు
● బోరు మోటర్లు ఉన్న వాటిని రిపేర్ చేయించని అధికారులు

**గ్రామపంచాయతీలో నిధులు లేవంట... గ్రామనివాసి మహేష్**



బోరు మోటర్లు బాగు చేయించడానికి ఎప్పుడు అడిగినా గ్రామపంచాయతీ కార్యదర్శి నిధులు లేవని అంటుంది. అంతేకాకు ఒడా ఒకవేళ చేయిస్తే తూతూ మంత్రంగా నకిలీ మోటార్లు, నకిలీ స్టార్టర్లను బిగించి అవి 10 రోజులు కూడా నడవకముందే కాలిపోవడం జరుగుతుంది.మరల వాటిని రిపేర్ చేయించడానికి ఎన్ని సార్లు పంచాయతీ కార్యదర్శి కి,మండల ఎంపీడీఓ కి విన్నవించుకున్న గ్రామపంచాయతీలో నిధులు లేవని మూడు నెలలు గడుస్తున్న బోరు మోటార్లను రిపేర్ చేయించడం లేదు.ఇప్పటికైనా పై అధికారులు కలెక్టర్,పంచాయతీరాజ్ అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించగలరని మందిపాల్ గ్రామస్తులు కోరుతున్నారు.

**చౌదాపూర్,మేజర్ న్యూస్ (నవంబర్ 02):**
చౌదాపూర్ మండల పరిధిలోని మందిపాల్ గ్రామంలో మిషన్ భగీరథ నీరు ప్రతిరోజు రాకపోవడం... మిషన్ భగీరథ నీరు వచ్చిన కొన్ని కాలనీలకు సరిపడ ఆ వాటర్ చేరకపోవడం వల్ల మందిపాల్ గ్రామంలో ప్రతినిత్యం నీటి సమస్యతో సతమతమవుతూ అనేక ఇబ్బందులకు గురవుతున్నామని మహిళలు,గ్రామ ప్రజలు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా త్రాగునీటి కష్టాలను తీర్చే





నాధుడే లేకపాయే అని గ్రామ ప్రజలు రాజకీయ నాయకుల పట్ల,అధికారుల పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ నీరు రావటం లేదు అని గ్రామాలలో ఉన్న బోర్ మోటర్లను మోటార్లను రిపేర్ చేయించి కనీసం వాటితోనైనా ప్రజల నీటి దాహార్తిని తీర్చాలని గ్రామపంచాయతీ కార్యదర్శికి, మండల ప్రజా పరిషత్ కార్యాలయం అధికారులకు గ్రామ ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు స్పందించి తాగునీటి కష్టాలు తీర్చడం లేదని గ్రామ ప్రజలు అధికారుల తీరు పట్ల,ప్రజా నాయకుల పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా పై అధికారులు కలెక్టర్,డిస్ట్రిక్ పంచాయతీరాజ్ ఆఫీసర్ స్పందించి మందిపల్ గ్రామస్తుల నీటి కష్టాలను తీర్చాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నారు.

# అద్వైత జ్యోతి కీసరగుట్టలో వెలిగింది!

● శృంగేరీ పీఠాధిపతి శ్రీ విధుశేఖర భారతీ స్వామివారి దర్శనంతో ఆలయం ఆధ్యాత్మిక కాంతిలో మునిగింది
● వేదపాఠశాలలో విద్యాభ్యాసం చేసిన స్వామివారికి సంప్రదాయ పూర్ణకుంభ స్వాగతం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి/కీసర,మేజర్ న్యూస్ (నవంబర్,02):**
దక్షిణామ్నాయ శృంగేరీ శారదాపీఠం జగద్గురు శ్రీ విధుశేఖర భారతీ స్వామివారి ధర్మవిజయ యాత్ర కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర ఆలయాన్ని ఆధ్యాత్మిక కాంతితో నింపింది. ఆదివారం స్వామివారు శ్రీ రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకోవడంతో ఆలయ ప్రాంగణం భక్తి తరంగాలతో మార్మోగింది. స్వామివారి పాదస్పర్శతో కీసర పర్వతం పవిత్రమైందన్న భావనతో భక్తులు ఆనందభాష్పాలు కార్చారు.

**సంప్రదాయ పూర్ణకుంభ స్వాగతం – వేదఘోషల నడుమ దర్శనం:**
స్వామివారి రాక సందర్భంగా ఆలయ ద్వారం వద్ద వేదపండితులు, అర్చకులు, ట్రస్ట్ సభ్యులు, భక్తులు భక్తిశ్రద్ధలతో స్వాగతించారు. పూర్ణకుంభ స్వాగతంతో ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారిని ఆహ్వానించగా, వేదఘోషలు, శంఖనాదం, ఘంటానాదం, మంగళవాయిద్యాలు మార్మోగాయి. ఆలయ సంప్రదాయం ప్రకారం పాదప్రక్షాళన అనంతరం పుష్పార్చనతో స్వామివారికి సత్కారం చేశారు. తరువాత స్వామివారు గర్భగుడిలో ప్రవేశించి శ్రీ రామలింగేశ్వర స్వామివారిని ప్రత్యేక పూజలో దర్శించుకున్నారు. అర్చకులు వేదమంత్రాలతో పూజ నిర్వహించగా, స్వామివారు మహామంగళారతిలో పాల్గొని ఆశీర్వచనం ఇచ్చారు. దర్శనానంతరం భక్తులకు ఆశీస్సులు అందించారు.

ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తాటకం నారాయణ శర్మ, కార్యనిర్వాహక అధికారి కట్టా సుధాకర్ రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు, పౌండర్ ట్రస్టీలు స్వామివారిని ఘనంగా ఆహ్వానించారు.
అలాగే కార్యక్రమంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.

**కీసరగుట్ట వేదపాఠశాలలో విద్యాభ్యాసం చేసిన ఆచార్యుడు:**



సనాతన వైదిక కుటుంబంలో జన్మించిన వీరి పూర్వాశ్రమ నామం కుప్పా వేంకటేశ్వర ప్రసాదశర్మ. తాత రామగోపాల శర్మ వాజపేయ శ్రౌతయాగం నిర్వహించిన ప్రముఖ యజ్ఞకర్త. తండ్రి కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని వైదిక పండితుడు. విధుశేఖర భారతీ స్వామివారు చిన్న వయసులోనే కీసరగుట్ట వేదపాఠశాలలో విద్యాభ్యాసం చేసి వేద విద్యలో పునాదులు వేసుకున్నారు. ఆ వేదాభ్యాసమే ఆయన జీవిత దిశను ఆధ్యాత్మికత వైపు మలిచింది.తరువాత శృంగేరీ పీఠం జగద్గురు భారతీతీర్థ మహాస్వామివారి అనుగ్రహంతో వేద, వేదాంగాలు, తర్క, మీమాంస, ధర్మశాస్త్రాలలో ప్రావీణ్యం సంపాదించారు.

**శృంగేరీ పీఠానికి ఉత్తరాధికారిగా అవతరించిన ఆచార్యుడు:**
2015లో భారతీతీర్థ స్వామివారు ప్రసాదశర్మను శృంగేరీ పీఠానికి ఉత్తరాధికారిగా నియమించారు. మాఘశుద్ధ విదియ, తదియ తిథుల్లో తుంగా తీరంలోని అభినవ విద్యాతీర్థ మహాస్వామి అధిష్ఠానంలో జరిగిన మహా శిష్య స్వీకార మహోత్సవంలో ఆయనకు ప్రణవోపదేశం, మహావాక్యోపదేశం చేసి 'శ్రీ విధుశేఖర భారతీ' అనే యోగపట్టం అనుగ్రహించారు. అప్పటి నుండి ఆయన సనాతన ధర్మ పరిరక్షణ, వేదప్రచారం, ఆధ్యాత్మిక పునరుజ్జీవన దిశగా విశేష సేవ చేస్తున్నారు.

**కార్తీక మాసం రద్దీ –పకడ్బందీ ఏర్పాట్లు:**
కార్తీక మాసం మరియు ఆదివారం కావడంతో ఆలయంలో భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో, స్వామివారి రాక సందర్భంగా ఆలయ అధికారులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, పౌండర్ ట్రస్టీలు, సంబంధిత శాఖల అధికారులు భక్తుల సౌకర్యార్థం పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు, త్రాగునీటి సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు సమర్థంగా అమలు చేశారు.

**వేదపాఠశాల విద్యార్థులకు ఆశీస్సులు:**
దర్శనానంతరం స్వామివారు తిరుమల తిరుపతి దేవస్థానం వేద సాంస్కృత పాఠశాలను సందర్శించి విద్యార్థులను ఆశీర్వదించారు. "వేదం భారతీయ సంస్కృతికి మూలం. వేద విద్యే మానవ జీవనానికి దిశా నిర్దేశం చేస్తుంది," అని స్వామివారు ఆశీర్వచనం ఇచ్చారు.

**అద్వైత దీప్తిగా వెలుగుతున్న ఆచార్యుడు:**
విధుశేఖర భారతీ స్వామివారి భాషణలు, ఆచరణలు భక్తుల మనసులను ఆకర్షిస్తున్నాయి. సౌమ్య స్వరంలో ఇచ్చే ఆయన ఉపన్యాసాలు అద్వైత సారాన్ని ప్రతిధ్వనింపజేస్తున్నాయి. స్వామివారి దర్శనంతో కీసరగుట్ట ఆలయ ప్రతిష్ఠ మరింత ఎత్తుకు చేరింది.భక్తులు ఆనందభాష్పాలతో:"గురుదేవుల పాదస్పర్శతో కేసర గిరి పవిత్రమైంది... శారదాపీఠ కాంతి మన క్షేత్రాన్ని ఆశీర్వదించింది" ౹ అంటూ భక్తి వాతావరణంలో మునిగిపోయారు.

# ఘనంగా ఎఫ్ఎస్‌సీఎస్ డైరక్టర్... రవిశంకర్ జన్మదిన వేడుకలు





రవిశంకర్ జన్మదిన వేడుకలు జరుపుతున్న నాయకులు

**పెద్దేముల్,మేజర్ న్యూస్ (నవంబర్ 02):**
పెద్దేముల్ మండల రైతు సేవా సహకార సంఘం డైరక్టర్ కోహీర్ రవి శంకర్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా జరిగాయి.నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన శుభకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, జిల్లా యువ నాయకులు రుద్రారం మైపాల్‌రెడ్డి, మంబాపూర్ శ్రీనివాస్‌రెడ్డి, చిట్టెపు రాఘవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నల్ల ఎల్లారెడ్డి, తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ డైరక్టర్ ఉప్పరి మల్లేశం, కాంగ్రెస్‌పార్టీ మండల వర్కింగ్ ప్రసిడెంట్ ప్రవీన్‌కుమార్, కోటపల్లి బంద్యప్ప, మంబాపూర్ హన్‌మాన్ దేవాలయ కమిటీ చైర్మన్ వర ప్రసాద్‌గౌడ్, పెద్దేముల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు డీవై. నర్సిములు, మైపూస్, నాగేందర్‌తో పాటు తదితరులు పాల్గోన్నారు.

# విద్యాసంస్థలను కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలి

**జేఏసీ ఆధ్వర్యంలో రెండో రోజు నిరసన దీక్ష**



నిరసన దీక్షలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

**కొడంగల్, మేజర్ న్యూస్ (నవంబరు 2):** మెడికల్ కళాశాల, గురుకులాలను కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రెండో రోజు ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన దీక్షలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ మెడికల్ కళాశాల, గురుకులాలతో పాటు మరిన్ని విద్యాసంస్థలను కొడంగల్‌లో ఏర్పాటు చేసి ఎడ్యుకేషన్ హబ్‌గా ఏర్పాటు చేయాలన్నారు. కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లిలో మెడికల్ కళాశాల, పాత కొడంగల్‌లో గురుకులాల కోసం శంకుస్థాపన చేసి ఇతర ప్రాంతాలకు తరలించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. విద్యాసంస్థలను కొడంగల్‌లో ఏర్పాటు చేసేంత వరకు జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామన్నారు. నిరసన దీక్షకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పీర్‌అహ్మద్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ జి.సురేశ్‌కుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, యు.రమేశ్‌బాబు, మాసాని వెంకటయ్య, భీమరాజు, ప్రవీణ్, జానపద కళాకారుడు బాలు, విద్యావంతులు సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మతుడి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం

మాడ్గుల, మేజర్‌న్యూస్ (నవంబర్ 02): మాడ్గుల మండలం నర్సంపల్లి గ్రామపంచాయతి పరిధిలోని చౌటకుంటతాండకు చెందిన నేనావత్ పంత్యానాయక్ అనారోగ్యంతో బాదపడుతూ గత మూడురోజుల కిందట మృతిచెందాడు. ఈ మేరకు విషయాన్ని తెలుసుకున్న తలకొండపల్లి మాజీ జడ్‌పిటిసి, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేష్ తన ట్రస్ట్ ద్వారా పంత్యానాయక్ కుటుంబానికి 3వేల రూపాయల ఆర్థిక సహాయం సమకూర్చడం జరిగిందని నర్సంపల్లి మాజీ సర్పంచ్ నేనావత్ హన్మానాయక్ తెలిపారు. ఇట్టి ఆర్థిక సహాయాన్ని ఆదివారం స్థానిక నాయకులతో కలిసి మృతుడి కుటుంబీకులకు అందజేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నేనావత్ దస్రునాయక్, నేనావత్ పాండునాయక్, బాలాజీనాయక్, భద్రనాయక్, వాల్యానాయక్, శ్యామ్‌నాయక్ తదితరులు ఉన్నట్లు మాజీ సర్పంచ్ హన్మానాయక్ వివరించారు.



# హిమాయత్ సాగర్ సర్వీస్ రోడ్డును సందర్శించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్





గండిపేట్, మేజర్ న్యూస్ (నవంబర్ 02)ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా హిమాయత్ సాగర్ జలాశయం గేట్లు తెరవడంతో. నీటి ప్రవాహానికి దెబ్బతిన్న సర్వీస్ రోడ్డును ఆదివారం స్థానిక నాయకులతో కలిసి సందర్శించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్. హిమాయత్ సాగర్ సర్వీస్ రోడ్డును యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఎమ్మెల్యే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ. ఇటీవల కాలంలో భారీ వర్షాల కారణంగా హిమాయత్ సాగర్ జలాశయం లో వరద ఉధృతి పెరగడంతో. జలాశయం గేట్లను తెరిచి ఈసీ నది లోకి నీటిని వదిలారని గుర్తు చేశారు. ఈసీ నదిలో ప్రవాహం పెరగడం వలన జలాశయానికి అతి సమీపంలో ఉన్న హిమాయత్ సాగర్ ఓ ఆర్ ఆర్ సర్వీస్ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని అన్నారు. దీని కారణంగా హిమాయత్ సాగర్ నుండి శంషాబాద్ కు వెళ్లే రోడ్డు మార్గం నిలిచిపోయిందన్నారు. దీని కారణంగా శంషాబాద్ కు వెళ్లే వాహనదారులు మరియు స్థానికులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టంగా ప్రణాళిక బద్ధంగా అధికారులు రోడ్డు మార్గాన్ని పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బుర్ర మహేందర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ లు బుర్ర సాగర్ గౌడ్, అస్లాం బిన్, నాయకులు గోకరి సురేష్ గౌడ్, పూలపల్లి కృష్ణారెడ్డి, నిఖిల సంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సొంత డబ్బులతో నక్షబాటకు మరమ్మత్తులు చేపట్టిన గ్రామస్థులు

- నల్లవారిపల్లి గ్రామస్థుల ఇండ్లనుండి వ్యర్ధనీరు నక్షబాటలో నిలిచి దుర్గందంగా మారిన వైనం
- సమీప పొలాల రైతులు, నాయకులు సొంత నిధులతో మొర్రంమట్టి పోయించి నక్షబాటకు మరమ్మత్తులు
- నక్షబాటను పునరుద్ధరించేలా ప్రత్యేక చొరవచూపిన మాడ్గుల ఎస్.ఐ నాగరాజుగౌడ్‌కు రైతులు, గ్రామస్థుల కృతజ్ఞతలు



మాడ్గుల, మేజర్‌న్యూస్ (నవంబర్ 02): మాడ్గుల మండలం నల్లవారిపల్లి గ్రామంలోని ఇండ్ల నుండి వ్యర్ధనీరు దశాబ్ధాల కాలంగా ఈ గ్రామం నుండి సింగంపల్లి వెళ్ళే రహదారిలో ఉన్న నక్షబాట ద్వారా స్థానిక గార్లకుంటలోకి వెళ్ళేదని స్థానికులు తెలిపారు. అయితే తమగ్రామానికి చెందిన ఓ రైతు గార్లకుంట తన పొలంలో ఉందని, ఊరి నుండి మురుగునీరు గార్లకుంటలోకి రావడానికి వీలులేదని అడ్డుగా మట్టికట్టను ఏర్పాటుచేయడంతో గ్రామంలో నుండి వచ్చే వ్యర్ధపునీరు నక్షబాటలో నిలిచి తీవ్ర దుర్గందం వెదజల్లుతూ సమీప పొలాల రైతులు, బాటసారులకు ఇబ్బందిగా మారినట్లు వారు వివరించారు. దీంతో నక్షబాటలో నిలిచిన వ్యర్థం నీటిని నిలువరించేందుకు ఆదివారం సమీప పొలాల రైతులు, గ్రామస్థులు సొంత నిధులతో మొర్రంమట్టితో చదునుచేయిస్తుండగా సదరు అడ్డకున్న రైతు తమను మరోమారు అడ్డుకోవడంతో గ్రామస్థులు, నక్షబాట ద్వారా రాకపోకలు సాగించే రైతులంతా కలిసి మూకుమ్మడిగా మాడ్గుల పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి సమస్యను ఎస్.ఐ నాగరాజుగౌడ్‌కు వివరించినట్లు గ్రామ నాయకులు బాలగోని మహేష్‌గౌడ్ తెలిపారు. వెంటనే స్పందించిన ఎస్.ఐ గ్రామస్థులతో కలిసి నల్లవారిపల్లికి చేరుకొని విచారణ చేపట్టడంతో సమస్య సద్దుమణిగినట్లు మహేష్‌గౌడ్ తెలిపారు. తమ సమస్య పట్ల సత్వరమే చర్యలు చేపట్టి నక్షబాట పునరుద్ధరణకు ప్రత్యేక చొరవచూపిన ఎస్.ఐ నాగరాజుగౌడ్‌కు నల్లవారిపల్లి గ్రామస్థులతో పాటు నక్షబాట ద్వారా రాకపోకలు సాగించే రైతులంతా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మహేష్‌గౌడ్ చెప్పారు. నక్షబాటకు మొర్రంమట్టితో చదునుచేయించి పునరుద్ధరించినవారిలో తనతో పాటు నాగిళ్ళ హన్మంత్, సిద్దమోని తిరుపతి, గుత్తి కృష్ణయ్య, బొడ్డుపల్లి మహేష్,, బొడ్డుపల్లి లక్ష్మయ్య, బాలగోని శ్రీకాంత్, ఈద అంజయ్య, తెలగమళ్ళ గౌరయ్య, ఇటీకాల సంజీవరెడ్డి, బాలగోని యాదయ్య, తెలగమళ్ళ రామస్వామి, తెలగమళ్ళ లక్ష్మయ్య, పట్టాభి జంగయ్య, సిద్ధిగారి నర్సింహ్మ (పల్లయ్య) గుత్తి శివలింగం, గుత్తి యాదయ్య, గుత్తి శ్రీశైలం, ఈద రమేష్, ఇటీకాల వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.



# పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రజా ప్రభుత్వం లక్ష్యం

## కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాసు శ్రీనివాస్‌రెడ్డి



తలకొండపల్లి, మేజర్‌న్యూస్ (నవంబర్ 02) : ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరంగా మారిందని, ప్రజారోగ్య పరిరక్షణే ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు శాతాబ్ది టౌన్‌షీప్ అధినేతా కాసు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిదిలోని లింగరావుపల్లి గ్రామానికి చెందిన బొచ్చుపల్లి ప్రకాష్ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ కార్పోరేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ఆసుపత్రి ఖర్చులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్య మంత్రి సహాయ నిధికి ధరఖాస్తు చేసుకోగా ప్రకాష్‌కు 60వేల రూపాయలు మంజూరయ్యాయి. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఆదివారం కాసు శ్రీనివాస్‌రెడ్డి రామకృష్ణాపురంలోని తన నివాసంలో లబ్దిదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అచ్చిరెడ్డి, దొండేటి యలమందారెడ్డి, రబ్బాని, రామచంద్రయ్య, పెంటయ్య, చెన్నయ్య, మహేష్ తదితరులు పాల్గోన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ గెలుపు ఖాయం : షాపూరం టింకు రెడ్డి



గండిపేట్, మేజర్ న్యూస్ (నవంబర్ 02) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు షాపూరం టింకు రెడ్డి అన్నారు. నవీన్ యాదవ్ గెలుపు కొరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో టింకు రెడ్డి ఆదివారం ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా షాపూరం టింకు రెడ్డి మాట్లాడుతూ.... జూబ్లీహిల్స్ లో ప్రజల స్పందన చూస్తుంటే భారీ మెజారిటీతో నవీన్ యాదవ్ గెలవడం ఖాయమని అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నవీన్ యాదవ్ కు మద్దతు తెలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం - బిఆర్ఎస్ పార్టీలో చేరిన జల్ పల్లి బిజెపి, కాంగ్రెస్ కార్యకర్తలు



జల్ పల్లి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 02):జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీరామ కాలనీ మౌలిక సదుపాయాల కొరకు ప్రత్యేక నిధులు కేటాయించారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సబితమ్మకు ధన్యవాదాలు తెలుపుతూ, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సబితా ఇంద్రారెడ్డి శ్రీరామ కాలనీలో చేసిన అభివృద్ధితో శ్రీరామరక్షగా జీవించామని అన్నారు. గత రెండేళ్ల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కాలనీ అభివృద్ధికి నోచుకోలేదని, కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి రాకుండా, మళ్ళీ సబితా ఇంద్రారెడ్డి తోనే తమ ప్రయాణం కొనసాగిస్తామని అందుకు నిదర్శనంగా పార్టీలో చేరడం జరిగిందన్నారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ. తనను నమ్ముకున్న కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతం, సంక్షేమం కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జల్ పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హామేద్, జల్ పల్లి యూత్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల అర్జున్, మహిళ ఉపాధ్యక్షురాలు కర్నాటి పద్మ, సాదిక్, శేఖర్, కాట్రగడ్డ వాసు బాబు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీ రామ కాలనీకి చెందిన బిజెపి, కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. జల్ పల్లి మున్సిపాలిటీ మాజీ సర్పంచ్ సూరెడ్డి కృష్ణారెడ్డి సూచన మేరకు జల్ పల్లి బిఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు ఉస్కెమూరి నిరంజన్ నేత ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయన్నారు. జల్ పల్లి బిజెపి, కాంగ్రెస్ నాయకులు, మహిళలకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు, మహిళలు మాట్లాడుతూ. శ్రీరామ కాలనీలో కొద్ది రోజుల క్రితం సబిత ఇంద్రారెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి

# మేడ్చల్ జిల్లాకు ఐదు రోడ్లు మంజూరు

● రూ.170 కోట్ల వ్యయంతో హ్యామ్ పద్ధతిలో పనులు
● నెల రోజుల్లో ప్రారంభం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (నవంబర్,02):** మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు హైబ్రిడ్ ఆన్యూటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో ఐదు ప్రధాన రహదారులను మంజూరు చేసింది. ఈ ప్రతిపాదనలు ఇటీవల అసెంబ్లీలో ఆమోదం పొందగా, ప్రభుత్వం ఇప్పటికే టెండర్ ప్రక్రియను పూర్తి చేసింది. మరో నెల రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయని జిల్లా రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసమూర్తి తెలిపారు.

జిల్లాకు మంజూరైన ఐదు రహదారుల మొత్తం పొడవు 63 కిలోమీటర్లు. వీటి విస్తరణకు రూ.170 కోట్లు ఖర్చు కానున్నాయి. ఇందులో ప్రభుత్వం 40 శాతం నిధులు, బ్యాంకులు 60 శాతం రుణం రూపంలో భరించనున్నాయి. ఇప్పటికే ఉన్న రహదారులను విస్తరించి, మరింత పటిష్ఠంగా, ఆధునిక ప్రమాణాలతో నిర్మించనున్నారు.

మంజూరైన రహదారుల్లో దుండిగల్–మేడ్చల్ రహదారి 10 కిలోమీటర్లు, మేడ్చల్–శామీర్‌పేట రహదారి 10 కిలోమీటర్లు, తూముకుంట–కొంపల్లి రహదారి 8 కిలోమీటర్లు, శామీర్‌పేట–ఘట్‌కేసర్ రహదారి 20 కిలోమీటర్లు, కీసర–తుర్కపల్లి రహదారి 15 కిలోమీటర్లుగా ఉన్నాయి.

రవాణా సౌకర్యాలు మెరుగుపడితేనే పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తారని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాల విస్తరణకు కూడా ప్రాధాన్యం ఇస్తోంది. రవాణా సౌలభ్యాన్ని పెంచి, పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడమే ఈ హ్యామ్ పథకం ప్రధాన ఉద్దేశం.

"మేడ్చల్ జిల్లాలో హ్యామ్ స్కీమ్ కింద ఐదు రోడ్ల పనులు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్ల ప్రాసెస్ ముగించుకుని, పనులు ప్రారంభించేందుకు నెల రోజులు పట్టవచ్చు.''



శ్రీనివానమూర్తి, జిల్లా రోడ్లు–భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

# మద్యంకు బానిసై ఓ యవకుడు ఆత్మ హాత్య



**మర్పల్లి మేజర్‌న్యూస్ (నవంబర్02)** మద్యంకు బానిసై మద్యం మత్తులో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కొత్లాపూర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది.మృతుని భార్య చామల మమత పోలీసులకు ఇచ్చినఫిర్యాదు ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.మండల పరిధిలోని కొత్లాపూర్ గ్రామానికి చెందిన చామల మోహన్‌రెడ్డి(30)అనే యువకుడు గత ఆరు రోజుల క్రితం ఇంటిలో నుండి వెళ్ళి ఎంతకు తిరిగి రాలేదుఎప్పుడు ఇలా వెళ్ళి తిరిగి వచ్చేవాడనీ కుటుంబ సభ్యులుఅంత చింతించ కుండా ఉండిపోయారురు .ఆదివారం తిరుపతి రెడ్డి అనే రైతు పొలానికి వెళ్ళగా రేకుల షెడ్డునుండిదుర్గందం వాసన రావడంతో వెళ్ళి చూడగా మోహన్‌రెడ్డి షెడ్డులో ఇనుప పోల్‌కు తాడుతో ఉరివేసకుని మరణించినట్లు తమకు తెలిపినట్లు మమత పేర్కోంంది.మృతుని భార్య ఫిర్యాదులో గత నెల 24 న తమను తమ పిల్లలతో కారులో జహీరాబాద్‌కు తీసుకెళ్ళి అక్కడక్కడ కారు ఆపి మద్యం తాగుతూ చివరకు తమ స్నేహితుడి ఇంటి కి తీసుకెళ్ళి అక్కడే నిద్రించామనీ మరుసటి రోజు ఉదయం మళ్ళి కొత్లాపూర్ గ్రామానికవచ్చామనీ 25సాయంత్రం మోహన్‌రెడ్డి ఫుల్‌గా మద్యం తాగి ఇంటికి వచ్చి గొడవ పెట్టుకోగాతమ మామ అయినపాండురంగారెడ్డి ఎప్పుడు గొడవలేరా మంచిగా ఉండండి అంటూ మందలించాడు సాయంత్రం బైక్‌పై వెళ్ళి ఎంతకు తిరిగా రాలేదనీతర్వాత శవమై కనిపించినట్లు మమత తెలిపింది మృతుడి భార్య మమత ఫర్యాదుమెరకు మర్పల్లి యస్.ఐ రహూఫ్ కేసు నమోదు చేసుకును ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.మృతుడికి కూతురు చైత్ర 06.కుమారుడు కౌశక్‌రెడ్డి 04 ఉన్నట్లు మమత తెలిపింది.

# పూడూరులో శివాలయానికి భక్తుల వెల్లువ

**కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ**



**మేడ్చల్, మేజర్ న్యూస్, (నవంబర్ 2):** మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పూడూరు గ్రామంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం భక్తులు పోటెత్తారు. స్థానిక శివాలయానికి ఉదయం వేళలనుండే భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శివప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, ఆలయం నిండా హర హర మహాదేవ్ నినాదాలు మార్మోగాయి. పూజల అనంతరం గ్రామ ప్రజల సహకారంతో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించి ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా అర్చకులు శివప్రసాద్ మాట్లాడుతూ, "కార్తీకమాసం ఆధ్యాత్మికతకు ప్రతీక. ప్రతి ఒక్కరూ భక్తి భావంతో సత్సంగం చేస్తూ, సమాజంలో ప్రేమ, స్నేహాన్ని పెంపొందించాలి" అని సూచించారు.

# ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోని వారికి నోటీసులు సిద్ధం

## – పంచాయతి కార్యదర్శి లాలప్ప

**పెద్దేముల్,మేజర్ న్యూస్ (నవంబర్ 02)॰** గ్రామ పంచాయతి కార్యాలయం నుండి ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోకుండా దుకాణాలు కొనసాగిస్తున్న యజమానులకు నోటీసులు సిద్ధం చేయడం జరుగుతుందని పెద్దేముల్ గ్రామ పంచాయతి కార్యదర్శి లాలప్ప తెలియచేశారు. వెంటనే ట్రేడ్ లైసెన్స్‌లు లేని వారు గ్రామ పంచాయతి నుండి అనుమతి తీసుకోవాలని కోరారు. లైసెన్స్‌లు తీసుకోకుండా దుకాణాలు కొనసాగితే అట్టి యజమానులకు పంచాయతి కార్యాలయం నుండి మూడు సార్లు నోటీసులు జారి చేసి తరువాత చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సోమవారం పలు దుకాణాలకు నోటీసులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా పెద్దేముల్ గ్రామ పంచాయతి కార్యాలయంలో సెల్ ఫోన్ టవర్స్ , కల్లు దుకాణాల యజమానులు , ఇతర వ్యాపారస్థులు కూడ తప్పకుండా ట్రేడ్ లైసెన్స్‌లు ఉండాన్నారు. లైసెన్స్‌లు రినివల్ చేసుకోని వారు సకాలంలో రినివల్ చేసుకోని గ్రామ పంచాయతి అధికారులకు సహకరించాలన్నారు. మూడు నోటీసులు ఇచ్చిన తరువాత వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియచేశారు. పెద్దేముల్ గ్రామ పంచాయతీలో చాల దుకాణాల యజమానులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోకుండా కొనసాగుతుందని కార్యదర్శి గుర్తు చేశారు.



**కల్లు దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి...**

వికారాబాద్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి కల్లు దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కార్యదర్శి లాలప్ప కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటు పై గత ఐదు రోజుల క్రితం పెద్దేముల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో స్థానిక ఎస్ఐ వేణుకుమార్ కల్లు దుకాణల యజమానులతో సమావేశం కూడ ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు కల్లు దుకాణాల యజమానులు ఉన్నతాధికారుల ఆదేశాలను తుచా తప్పకుండా పాటించాలని కోరారు.

# కాలువలో చికెన్ వ్యర్థాలు

● ప్రజల్లో ఆందోళన ● మేడ్చల్ పట్టణంలో చికెన్ సెంటర్‌ల నిర్లక్ష్యం
● అధికారులు నిర్లిప్తత



**మేడ్చల్, మేజర్ న్యూస్, (నవంబర్, 2):** మేడ్చల్ పట్టణంలో కొందరు చికెన్ సెంటర్‌ల నిర్వాహకులు ధనార్జన కోసమే నడుచుకుంటూ పర్యావరణానికి నష్టం కలిగిస్తున్నట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోళ్లను వధించగా వచ్చే వ్యర్థ పదార్థాలు, రక్తం మొదలైనవి పట్టణంలోని ప్రధాన సాగునీటి కాలువలో పైప్‌లైన్‌ల ద్వారా నేరుగా వదిలిపెడుతున్నట్లు వెల్లడైంది.స్థానికుల పేర్కొన్న ప్రకారం, ఈ వ్యర్థాల కారణంగా కాలువలోని నీరు పూర్తిగా కలుషితమవుతోంది. కాలువ వెంట తీవ్రమైన దుర్గంధం వ్యాపించి, పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు విపరీతంగా పెరిగిపోవడం, వాహనదారులకు కుక్కల ఇబ్బందులు తలెత్తడం వంటి సమస్యలు ఎక్కువవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రతిరోజూ కాలువ నుంచి దుర్వాసన వస్తోంది. పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు," అని స్థానికులు తెలిపారు.

ఇకనైనా సంబంధిత మున్సిపల్ అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి చికెన్ సెంటర్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కాలువను శుభ్రపరచి శానిటైజేషన్ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.






# పేద కుటుంబానికి అండగా ముదిరాజ్‌న సంఘ సభ్యులు



**దోమ, మేజర్ న్యూస్ (అక్టోబర్ 02)॰** దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామానికి చెందిన చంద్రకంటి రవిమరణించడంతో వారి అంత్యక్రియలకు బొంపల్లి ముదిరాజ్ సంఘం తరఫున 9000రూ ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి యాదయ్యముదిరాజ్ సంఘం పెద్దలు గుడిసె బాబు, బుగ్గయ్య, నరేష్, శ్రీనివాస్, యాదగిరి, పెంటయ్య,పుల్లయ్య,రాజు, నవీన్, మొగులయ్య, యువకులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన

# బుయ్యని బ్రదర్స్ ..

**- పెండ్లి పత్రికను అందించిన అన్నదమ్ములు**

**- అప్యాయంగా పలకరించిన సీఎం రేవంత్ రెడ్డి**

తాండూరు,మేజర్ న్యూస్(నవంబర్ 02): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారం నాడు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, ఆయన సోదరుడైన ఆర్ బిఓఎల్ ప్యాక్టరీ అధినేత మరియు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేత ఐన బుయ్యని శ్రీనివాస్ రెడ్డిలు కలిశారు.హైదరాబాద్ నగరంలోని సీఎం నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు.శ్రీనివాస్ రెడ్డి కుమారుడైన బ్రిజేష్ రెడ్డి వివాహానికి రావాల్సిందిగా కోరుతూ పెండ్లి పత్రికను అందించారు. ఈ నెల 8వ తేదీన శనివారం నాడు హైదరాబాద్ నగర సమీపంలోని జన్వాడ ప్రాంతంలో గల కే. కొన్వేషన్ హాల్‌లో వివాహం జరుగ నుంది ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అన్నదమ్ములైన మనోహర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి లను అప్యాయంగా పలకరించి పెండ్లి పత్రికను అందుకున్నారు.



# హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు కండ్లు కనిపించడం లేదా ?

## కళ్ళు మూసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం అని ప్రశ్నించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి






గండిపేట్, మేజర్ న్యూస్ (నవంబర్ 02)పేదల ఇండ్లు కూల్చడంలో చూపిస్తున్న ఉత్సాహం మూసీ నది ని ఆక్రమించి నిర్మిస్తున్న శ్రీ ఆదిత్య లగ్జరీ బహుళ అంతస్తుల నిర్మాణం హైడ్రా కమిషనర్ రంగనాథ్ కళ్ళు కనిపించడం లేదా? అని ప్రశ్నించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి. ఆదివారం రాజేంద్రనగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పటోళ్ల కార్తిక్ రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, లతో కలిసి నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని నార్సింగి సర్కిల్ లో మూసీ నది లో అక్రమంగా నిర్మిస్తున్న శ్రీ ఆదిత్య లగ్జరీ నిర్మాణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సబిత ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.....చెరువులు నాళాలు కబ్జా చేశారని బక్క చిక్కిన బలహీనుల ఇండ్లను నిర్ధాక్షణంగా కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు. నగర శివారులోని నార్సింగి సర్కిల్ వద్ద మూసీ నదిలో నిర్మిస్తున్న భారీ నిర్మాణాన్ని ఎందుకు కూల్చడం లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ని ప్రశ్నించారు?. హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు కళ్ళు కనిపించడం లేదని కాంగ్రెస్ పార్టీ కళ్ళు మూసుకొని పరిపాలన కొనసాగిస్తుందని మండిపడ్డారు. పేదలపై చూపిస్తున్న ప్రతాపం పెద్దలపై ఎందుకు చూపడం లేదని నిలదీశారు. ఈ మధ్యకాలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా నార్సింగి చౌరస్తాలోని శ్రీ ఆదిత్య లగ్జరీ నిర్మాణం పూర్తిగా మునిగిపోయినప్పటికీ. ఆ నిర్మాణం పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు అని అన్నారు. మునినది బఫర్ జోన్ లో నిర్మాణాలు ఉన్నాయని సాకుతో అక్రమంగా పేదల ఇండ్లను కూల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం. ఇంత పెద్ద నిర్మాణం చేపడుతుంటే కళ్ళు మూసుకుందా అని మండిపడ్డారు. గండిపేట్ నుండి అత్తాపూర్ వరకు ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. నార్సింగ్ లోని శ్రీ ఆదిత్య లగ్జరీ కన్స్ట్రక్షన్ సంస్థ అక్రమ కట్టడాలను కూల్చివేయలేకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కె .విష్ణువర్ధన్ రెడ్డి, మైనారిటీ ఇంచార్జ్ ముక్తార్, బ్యాటరీ విష్ణువర్ధన్, బక్కని సాయికుమార్, ముత్యాలు, లక్ష్మి, జై సింహా, ప్రభాకర్ స్వామి, సంతోష్, మహేందర్ ,గంగుల దర్శన్ ,మహమూద్ సత్తార్, అసద్ ఖాన్, శ్రీకాంత్ రెడ్డి , సంతోష్ గౌడ్, ప్రియదర్శిని ,జయమ్మ, మహమ్మద్ ఇర్ఫాన్, చిరంజీవి, సంతోష్ ,తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో కారు గుర్తుదే హవా...



మణికొండ, మేజర్ న్యూస్ (నవంబర్ 2): తెలంగాణ జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలలో బిఆర్ఎస్‌దే హవా నడుస్తుందని బిఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ నాయకులు షేక్‌పేట డివిజన్‌లోని వాడ వాడ తిరుగుతూ బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపినాధ్‌ని గెలపించి కాంగ్రెస్ మెడలు వంచాలని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ గుండెల్లో బిఆర్ఎస్ జాతర ఎలా ఉంటదో చూపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ 24లో నాయకులు జీషాన్, బిందు, అశోక్, రమేష్, సంపత్, బిలాల్ మణికొండ మున్సిపల్ యూత్ ప్రసిడెంట్ సంగం శ్రీకాంత్, భానుచందర్, మంజూల, బూత్29లో వెంకటేశ్, రాములు, కృష్ణా, యాదగిరి, ప్రభాకర్, సినియర్ నాయ కులు కుంబగళ్ల ధన్‌రాజ్, అందె లక్ష్మణ్‌రావు, గడ్డమీది శ్రీనివాస్, వెంకటేశ్, కిరణ్, బూత్ 30లో స్థానికులు అశోక్, యాదవ్‌రావు, ఎం. వెంకటయ్య, పరమేష్, మల్లేష్, సినియర్ నాయకులు మూర్తి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# దళారులను నమ్మిమోసపోకండి...

**▶▶ సీసీఐ పత్తి కొనుగోటు కేంద్రాలల్లో పత్తి విక్రయాలు చేయండి ▶▶ కోటపల్లి ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ ఆంజయ్య, నారాయణరెడ్డి ▶▶ తేమ శాతంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చుస్తాం**



పెద్దేముల్,మేజర్ న్యూస్ (నవంబర్ 02): ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలల్లో పత్తి విక్రయాలు చేయాలని ... దళారులను నమ్మి మోసపోవద్దని కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డిలు అన్నారు. అదివారం పెద్దేముల్ మండల కేంద్రంలోని మారేపల్లి గ్రామ శివారుల్లో ఉన్న సుమిత్ర కాటన్ , మంగళం జిన్నింగ్ కేంద్రాలల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆంజయ్య, నారాయణరెడ్డిలు మాట్లాడుతూ భారీ వర్షాలకు పత్తి పంటలు పాడైనందున , పత్తి రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలల్లో పత్తి విక్రయాలు చేయాలన్నారు . పత్తి రైతులకు మద్దతు ధర దక్కించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రతి మండలంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పత్తి పంటలు భారీ వర్షాలకు పూర్తిగ పాడైనందున సీసీఐ అధికారుల తేమ విషయంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చుడాలన్నారు.సీసీఐ ద్వార రైతులు పత్తి విక్రయాలు చేస్తే ప్రభుత్వం క్వింటాళ్లుకు రూ.8,110 ధర దక్కుతుందని, అదే పత్తిని దళారులకు విక్రయాలు చేస్తే క్వింటాళ్లుకు రూ.1,000 నుండి రూ.1,200ల వరకు ధర తగ్గుతుందన్నారు. గత ఏడాది పెద్దేముల్ మండల సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వార చెసః డబ్బులు సుమారు రూ.2కోట్ల వరకు నిధులు జమయ్యాయని తెలియచేశారు. ప్రతి పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని వసతులు కల్పించాలని, ఇబ్బందులు లేకుండా చుడాలని పలువురు నాయకులు అధికారలకు తెలియచేశారు. వెంటనే స్పందించి వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ముక్రం ఖాన్ తప్పకుండా అన్ని వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యదర్శి ముఖ్రం కాన్ , సీసీఐ ఇన్‌చార్జీ ఏ. కుట్టె కుమార్, మారేపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొమ్ము గోపాల్‌రెడ్డి, జిల్లా యువ నాయకులు రుద్రారం మైపాల్‌రెడ్డి, మంబాపూర్ శ్రీనివాస్‌రెడ్డి , చిట్టెపు రాఘవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నల్ల ఎల్లారెడ్డి, తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ డైరక్టర్ ఉప్పరి మల్లెశం, కాంగ్రెస్‌పార్టీ మండల వర్కింగ్ ప్రసిడెంట్ ప్రవీన్‌కుమార్, సుమిత్ర కాటన్, మంగళం కాటన్ మిల్ యజమానులు గోల్ సేట్, అల్లెంకల సంతోష్ కుమార్, ఎండీ నహీం, కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి డైరక్టర్‌లు ఎగ్బాల్, హరిసుదన్‌రెడ్డి, అగ్బర్, విఠల్‌గౌడ్, కోటపల్లి బంద్యప్ప, మంబాపూర్ హన్‌మాన్ దేవాలయ కమిటి చైర్మన్ వర ప్రసాద్‌గౌడ్, పెద్దేముల్ గ్రామ కమిటి అధ్యక్షుడు డీవై. నర్సిములు, రైతులు వీరారెడ్డి, మైపూస్, నాగేందర్‌తో పాటు పలు గ్రామాల రైతులు తదితరులు, కోటపల్లి ఏఎంసీ సిబ్బంది వెంటక్, రమేష్‌తో పాటు తదితరులు పాల్గోన్నారు.



## వికలాంగులకు, వృద్ధులకు అండగా

## శ్రీ రాజమాత ఫౌండేషన్ - అధ్యక్షుడు ఉదయ్ రెడ్డి



ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (నవంబర్ 02) : వికలాంగులు, వృద్ధులకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శ్రీ రాజమాత ఫౌండేషన్ అధ్యక్షుడు ఉదయ్ రెడ్డి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలో ఆదివారం ఇద్దరు వికలాంగులకు వీల్‌చెయర్లు అందజేసి అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ రెడ్డి మాట్లాడుతూ...శ్రీ రాజమాత ఫౌండేషన్ దాతలు అందిస్తున్న సహకారంతో నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదల ఆకలి తీర్చడం, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, వృద్ధులు, వికలాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు మనోజ్ రెడ్డి, సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, సింహ, పవన్, విజయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికి దాతల విరాళం



నిజాంపేట్ మేజర్ న్యూస్ : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మధురా నగర కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అష్టలక్ష్మి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ప్రశాంతి హిల్స్ కాలనీకి చెందిన మేకల రవి 50117/-,మధురా నగర్ కాలనీకి చెందిన శివన్నాయుడు,11,116/- ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ధన రూపేణా, వస్తు రూపేణా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ నిర్మాణం పూర్తి కావస్తుందని త్వరలో ప్రారంభించనున్న ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరు బాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.విష్ణువర్ధన్ రావు, సి హెచ్ హేమంత్ రావు, రాంబాబు, ఆర్.ఏ.మద్దయ్య, హన్మంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# తన గ్రామ యువతను పెద్ద ఆఫీసర్లు చేయడమే లక్ష్యం..

**- 100 మంది కి పైగా గ్రూప్-1, గ్రూప్-2 సాధించడం కోసం ప్రోత్సాహాన్ని అందిస్తా - గ్రామంలో విద్య, ఉద్యోగ అవకాశాలు ఏర్పాటుకు కృషి**

**- మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తా - నందివనపర్తి ప్రజలు తనను ఆశీర్వదించండి అంటున్న గోరటి వెంకటేశం**



యాచారం, మేజర్ న్యూస్ (నవంబర్ 2 ): నంది వనపర్తి గ్రామంలో ఉన్నత విద్యా, ఉన్నతమైన ఉద్యోగాలు సంపాదించడమే లక్ష్యంగా పనిచేస్తానని గోరటి వెంకటేశం అన్నారు. యాచారం మండలం నందివనపర్తి గ్రామానికి చెందిన గోరటి వెంకటేశం ఆదివారం మేజర్ న్యూస్ తో మాట్లాడుతూ... రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా సర్పంచ్ అభ్యర్థిగా నంది వనపర్తి లో పోటీ చేయనున్నట్లు తెలిపారు. నంది వనపర్తి ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. నంది వనపర్తి లో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం తన శక్తి వంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. గ్రూప్ - 1,గ్రూప్-2, సివిల్స్ కోచింగ్ సెంటర్లను ఏర్పాటుచేసి, అర్హత ఉన్న విద్యార్థులకు ఆఫీసర్లు అవ్వడానికి అన్ని ఏర్పాట్లు, వసతులు సమకూర్చుతానని హామీ ఇచ్చారు. తన గ్రామంలో కనీసం 100 మందికి పైగా గ్రూప్-1, గ్రూప్ -2 ఆఫీసర్లుగా తీర్చిదిద్దడం కోసం భగీరథ ప్రయత్నం చేస్తానని తెలిపారు. తన గ్రామీణ యువత ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందడం తన లక్ష్యంగా పేర్కొన్నారు. తన గ్రామ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు అందుబాటులో తీసుకువస్తానని, గ్రామంలోనే అందుకు కావాల్సిన శిక్షణ నిర్వహణ ఏర్పాటు చేస్తానని తెలిపారు. కుట్టు మిషన్, వస్త్రాలు, చేతిపనులు, మగ్గం వర్క్స్, బ్యూటీ పార్లర్ ఇలా మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన అన్ని రంగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శింపచేసే శిక్షణ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రాథమిక విద్యార్థులకు సాయంత్రం వేళ రోజు ట్యూషన్, నిరుద్యోగ యువత కోసం, ఉద్యోగం సాధించే మార్గాలు చూపుతానని, వారికోసం ప్రత్యేకమైన నైపుణ్య శిక్షణలు అందిస్తానని తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక కంప్యూటర్ విద్య శిక్షణ కోసం గ్రామంలోని ప్రతి కమ్యూనిటీ హాల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసి నిపుణులచే శిక్షణ ఇప్పిస్తానన్నారు. హామీ ఇచ్చిన అన్ని వాగ్దానాలు నెరవేర్చి చూపిస్తానని, సర్పంచ్ అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని, గ్రామీణ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడతానని గోరటి వెంకటేశం నంది వనపర్తి ప్రజలను కోరారు.

# బీసీ సోదరులు కదలిరండి, 42 శాతం రిజర్వేషన్ సాధించుకుందాం

### బీసీ రిజర్వేషన్ సాధన సమితి సభ్యులు పిలువు...



యాచారం, మేజర్ న్యూస్ (నవంబర్ 2): 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఉద్యమ సంఘం ఆధ్వర్యంలో నేడు యాచారం తహసిల్దార్ కార్యాలయం ముట్టడి, వినతి పత్రం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, మండల పరిధిలోని బీసీలంతా పాల్గొనాలని, యాచారం మండల బీసీ రిజర్వేషన్ సాధన సమితి సభ్యులు , అడ్వకేట్ యాదయ్య గౌడ్,ఆకుల బిక్షపతి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ... మండల పరిధిలోని బీసీ సోదరులంతా తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి రావాలని, 42 శాతం రిజర్వేషన్ సాధనే లక్ష్యంగా అందరూ ముక్తకంఠంతో తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీలు ఇప్పుడు ఏకమై గర్జిస్తేనే ప్రతిఫలం దక్కుతుందని, భవిష్యత్ తరాలకు మంచి జరుగుతుందని పేర్కొన్నారు. తమ హక్కులు నెరవేరాలంటే ప్రతి ఒక్క బీసీ స్పందించాలని, నేటి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తూ పిలుపునిచ్చారు. బీసీలకు మద్దతుగా ఎస్సీ, ఎస్టీలు సహకరించాలని కోరారు.

# పద్మా రం గ్రామంలో నెరవేరుతు న్న సొంతింటి కళ

**- ప్రజాప్రభుత్వం లో జోరుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు.**



జిల్లేడు- చౌదరి గూడెం: మేజర్ న్యూస్:( నవంబరు:2):. చౌదరి గూడెం మండల పరిధిలోని పద్మా రం గ్రామంలో రెండు ఇళ్ల కు స్లాబ్ లకు పూజలు నిర్వహించారు. లబ్ధదారులు శాబాద్ లక్ష్మి, రవి, షాబాద్ జో తీ భర్త వెంకటేశ్ ల ఇళ్లకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ జాయింట్ కన్వీనర్ అశోక్ మాట్లాడుతూ. గతప్రభుత్వం బి ఆర్ ఎస్ పార్టీ నిర్లక్షం వల్ల ఈనాడు, ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించారు అని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధదారు లు త్వరిత గతిన అందరూ ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేసుకోవాలని అశోక్ కోరారు. మాజీ సర్పంచ్ లక్ష్మి సుధ నర్సింలు, నవిన్ గౌడ్, వెంకటేశ్, కృష్ణ, కుమార్ గౌడ్, మోహన్, యాదయ్య, బాబయ్య, కృష్ణయ్య, రమేశ్, సాయి రామ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి బి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తాం : గోపాల్ ముదిరాజ్

కర్మన్ ఘాట్ ,మేజర్ న్యూస్ :చంపాపేట్ డివిజన్ మాధవ నగర్ కాలనీ లో నూతన కార్యవర్గ ఏర్పాటు కు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఎలక్షన్ ఆఫీసర్ శంభు ప్రసాద్ విజయసేనారెడ్డి ,చంద్రు నాయక్ సమక్షంలో ఆదివారం గోపాల్ ముదిరాజ్ కాలనీ ప్రెసిడెంట్ గా మరియు ప్యానల్ సభ్యులు నామినేషన్ వేయడం జరిగింది. 9వ తారీకు ఆదివారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ఎన్నికలు నిర్వహించబడును. కావున కాలనీ వాసులు మీ అమూల్యమైన ఓటు ను గోపాల్ ముదిరాజ్ ప్యానెల్ కు వేసి గెలిపించాలని కోరారు.

# నేడు విద్యుత్ సమస్యలపై సమావేశం

జల్ పల్లి, మేజర్ న్యూస్ (నవంబర్ 03):నేడు విద్యుత్ సమస్యలపై వినియోగాదారులతో సమావేశం ఉంటుందని మామిడిపల్లి ఏడిఈ శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం 1:00 వరకు విద్యుత్ సమస్యల వల్ల లోవోల్టేజ్, బిల్లుల హెచ్చుతగ్గులు, పేరు మార్పిడి తదితర కేటగిరి మార్పుల సమస్యలపై మామిడిపల్లి విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం (తుక్కుగూడ)లో సమావేశం ఉంటుందని, కందుకూరు, మహేశ్వరం, పహాడీ షరీఫ్, బాలాపూర్ ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు హాజరు కావాలని ఏడిఈ శంకర్ కోరారు.

## ఆరోగ్య సమస్యలతో ఉరి వేసుకొని వృద్ధుడి ఆత్మహత్య




నందిగామ, మేజర్ న్యూస్ ( నవంబర్ 02): నందిగామ మండల కేంద్రానికి చెందిన వడ్ల శ్రీనివాస్ (65) అనే వృద్ధుడు గత 20యేండ్లుగా మధుమేహ వ్యాధితో బాదపడుతూ ఆరోగ్య సమస్యలు భరించలేక ఆదివారం ఇంట్లో పైకప్పుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి కుమారుడు వడ్ల ప్రవీణ్ నందిగామ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చినట్లు సి.ఐ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మధ్యాహ్నం 10-30 గంటల సమయంలో తన తల్లి జయమ్మ , సోదరుడు నవీన్ లతో కలిసి పొలం వద్దకు వెళ్తుండగా తమ తండ్రి వడ్ల శ్రీనివాస్ ఇంట్లో టి.వి చూస్తూ కూర్చున్నాడని, తామందరం పొలం వద్దకు వెళ్ళిన అనంతరం ఇంటిలోపల తలుపుకు గడియ పెట్టి ఇంటి పైకప్పు ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు, పొలం నుండి ఇంటికి చేరుకున్న తాము పొరుగు ఇండ్లవారి సహాయంతో తలుపులు ధ్వంసం చేసి తన తండ్రిని కిందికి దించినట్లు, తమ తండ్రి ఆరోగ్య సమస్యలతోనే ఆత్మహత్యకు పాల్పడివుండవచ్చని, తమ కుటుంబీకులకు ఎవరిపై అనుమానం లేదని మధ్యాహ్నం 1-45 గంటల సమయంలో వడ్ల ప్రవీణ్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో తెలిపినట్లు సి.ఐ ప్రసాద్ వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# వీరబ్రహ్మేంద్రస్వామి 417వ జయంతి!!



ముషీరాబాద్,మేజర్న్యూస్ : ట్యాంక్బండ్ పై ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 417వ జయంతిని ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. అడ్లూరి రవీంద్రాచారి కన్వీనర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది . ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘం నేతలు కుందారపు గణేషాచారి ,మారోజు ఆచార్య, శంకరాచార్య, కళ్యాణ్,వెంకటాచారి, శ్రీనివాస్, బలరామకృష్ణయ్య, టి.శ్రీనివాస్, హర్ష, కరుణ శ్రీ, సత్యం, నరేందర్, రాజేంద్రప్రసాద్, పీఎస్ఎన్ మూర్తి, కళ్యాణ్, వెంకటాచారి, ఏ.శ్రీనివాసాచారి,కళాధర్,సంకోజు , ఇంద్రవెల్లి రమేశ్, బాణాల ద్రోణాచారి, తంగెళ్ళపల్లి కనకాచారి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వం అధికారపూర్వకంగా బ్రహ్మంగారి జయంతి ఉత్సవాలు నిర్వహించేలా ప్రభుత్వానికి సూచిస్తామని కుందారపు గణేషాచారి ఈ సందర్భంగా పేర్కొన్నారు

# సినీగాన మందార మకరందం!

ముషీరాబాద్,మేజర్న్యూస్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కల్పన కళానికేతన్ సినీసంగీత విభావరి నిర్వహించారు. డా.సి.నారాయణరెడ్డియాదిలో-తెలుగు,హిందీ సినీగాన మందార మకరందం నిర్వహించారు. ఇ.భూమరావు (ఎక్స్డైరెక్టర్, సింగరేణి కాలరీస్) ను ఘనంగా నిర్వహించారు., డి.నాగేందర్(ప్రముఖ రంగస్థల నటులు,జనరల్ సెక్రటరీ ఇండియన్ నేషనల్ థియేటర్),పొన్నం శ్రీనివాస్రావు ప్రముఖ న్యాయవాది విశిష్ట అతిథిగా హాజరయ్యారు.గాయనీ గాయకులు -డా.మురళీమోహన్,దేవేందర్గౌడ్, బి.భీంరావు, ఎస్.మాన్సింగ్,సీహెచ్ ప్రసాద్, వీఎస్కే ప్రసాద్, ఐరేని రమేశ్గౌడ్,సీహెచ్ జంగయ్య, ఎం.రమణాచారి (యాంకర్), ఆకులగీత, సి.కామేశ్వరి,రమాదేవి, ఆనందలక్ష్మి,సుస్మిత పాటలను ఆలపించారు.